లక్ష్యానికి దూరంగా కొనుగోళ్లు

- చందుర్తి మండలంలో ధాన్యం సేకరణ లక్ష్యం 2.50లక్షల క్వింటాళ్లు
- సేకరించింది 1.35లక్షల క్వింటాళ్లు
- 1,273 మంది రైతులకు గాను 212 మంది ఖాతాల్లో డబ్బులు
- కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం వర్షార్పణం
- కోతలపై మిచాంగ్ ప్రభావం



తుపాను ప్రభావంతో ధాన్యం కుప్పలపై కవర్లు

చందుర్తి: మండలంలో ధాన్యం కొనుగోళ్లు లక్ష్యానికి చేరుకోలేదు. కొనుగోలు కేంద్రాలు ప్రారంభమై నెల రోజులు గడుస్తున్నా ధాన్యం సేకరణ ఇంకా పూర్తి కాలేదు. దీనికి తోడు కొనుగోలు కేంద్రాలకు తరలిన ధాన్యం మిచాంగ్ ముసురుకు తడిసి ముద్ద య్యింది. కోతకు సిద్ధంగా ఉన్న పంట కళ్ల ముందే నేలవాలిపోతుంటే రైతులు కలవరపడుతున్నారు. కొనుగోలు కేంద్రాలకు టార్పాలిన్ ఇవ్వకపోవడంతో రైతులు తమ వద్ద ఉన్న కవర్లతోనే ధాన్యం తడవకుండా కాపాడుకుంటున్నారు. అధికారులు స్పందించి తేమతో సంబంధం లేకుండా మిగిలిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని వేడుకుంటున్నారు.

ధాన్యం కొనుగోలులో జాప్యం

మండలంలోని సనుగుల, చందుర్తి సింగిల్‌విండోల ఆధ్వర్యంలో సుమారు 20 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. సుమారు 2.50లక్షల క్వింటాళ్ల ధాన్యం సేకరణ ఉండొచ్చని అధికారులు అంచనా వేసుకున్నారు. అందుకు అనుగుణంగా పంట దిగుబడి వచ్చినా.. కొనుగోలు కేంద్రాల్లో జాప్యానికి విసిగిపోయిన రైతులు చాలామంది ధాన్యాన్ని వ్యాపారులకు విక్రయించారు. చందుర్తి సింగిల్‌విండో పరిధిలో 12 కొనుగోలు కేంద్రాల్లో 1.50లక్షల క్వింటాళ్ల ధాన్యం సేకరించాల్సి ఉండగా.. 63,837 క్వింటాళ్లు మాత్రమే సేకరించారు. 612 మంది రైతుల వద్ద సేకరించిన ధాన్యానికి కేవలం 142 మంది ఖాతాల్లో మాత్రమే డబ్బులు జమయ్యాయి. రామన్నపేట, తిమ్మాపూర్, కట్టలింగంపేట, మూడపల్లి కేంద్రాల్లో కొనుగోళ్లు పూర్తి చేశారు. జోగాపూర్, మర్రిగడ్డ, నర్సింగపూర్, ఆశిరెడ్డిపల్లె గ్రామాల్లో 80వేల క్వింటాళ్ల ధాన్యం వ్యాపారులకు విక్రయించారు. సనుగుల సింగిల్‌విండో పరిధిలో 8 కొనుగోలు కేంద్రాల్లో 90వేల నుంచి లక్ష క్వింటాళ్ల ధాన్యం సేకరించాల్సి ఉండగా.. ఇప్పటివరకు 62,427 క్వింటాళ్ల ధాన్యం సేకరించారు. 623 మంది రైతుల నుంచి ధాన్యం సేకరించగా.. కేవలం 70 మంది రైతుల ఖాతాల్లో డబ్బులు జమయ్యాయి. దేవునితండా, సనుగుల, కిష్టంపేట కేంద్రాల్లో ధాన్యం సేకరణ పూర్తి చేయగా.. లింగంపేట, రుద్రంగి, బండపల్లి, రామరావుపల్లె గ్రామాల్లో ధాన్యం సేకరణ కొనసాగుతోంది. మరో 15వేల క్వింటాళ్ల వరకు సేకరణ జరగొచ్చని అంచనా. మరో 30వేల క్వింటాళ్ల వరకు వ్యాపారులకు విక్రయించారు.



ముసురుతో నేలవాలిన వరి పంట

కోతలు కష్టమే..

మండలంలో సుమారు 14,530 ఎకరాల్లో వరి సాగు చేయగా.. సుమారు 2వేల ఎకరాలకు పైగా వరి కోతలు పూర్తి కాలేదు. రెండు రోజులుగా కురుస్తున్న ముసురుతో భూమిలో తేమ శాతం పెరిగింది. తుపాను ప్రభావం అధికమైతే మరో రెండు వారాల వరకు కోతలు కష్టమేనని రైతులు భావిస్తున్నారు. పంట చేతికొచ్చే సమయంలో అకాల వర్షంతో అన్నదాత ఆగమైతున్నాడు. మిగిలిన పొలాల్లో ఎక్కువగా సన్నాలు కావడంతో రైతులు వాటిని తిండి కోసం సాగు చేసుకున్నారు. ముసురుతో చేతికాడి బుక్క చేతికందకుండా పోతుందా అని ఆందోళన చెందుతున్నారు.

పొలం మడుల్లో నీరు



రెండున్నర ఎకరాల పొలం కౌలు ఏసిన. తుపాను ముసురుకు పొలం మడులు తడిగా మారాయి. చినుకులకు పంట నేలవాలిపోయింది. మరో వారం రోజులు గడిచినా తడి ఆరేట్లు కనిపించడం లేదు. చేతికచ్చే సమయంలో పంట నష్టమైంది. వర్షం ఎక్కువైతే దిగుబడి సగానికి సగం తగ్గుతుంది.

– కుమ్మరి రవి, రైతు, బండపల్లి

వ్యాపారికి విక్రయించిన



ధాన్యాన్ని ఆరబెట్టుకునేందుకు స్థలం లేదు. రోడ్డుపై పోసుకొని నెల రోజుల పాటు పడిగాపులు కాసే కన్నా వ్యాపారికి అమ్మడమే మంచిదనుకున్న. కోత కోయగానే రూ.200 తక్కువకు వ్యాపారికి విక్రయించిన. ఏ ఇబ్బంది లేకుండా కోత కోసిన రోజే కాంటా వేసుకున్నారు.

– లక్కర్సు శ్రీధర్, రైతు, చందుర్తి

ఖాతాలో జమ కాలె



ధాన్యాన్ని కోసిన 20 రోజులకు కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. విక్రయించిన నాలుగు రోజుల్లో డబ్బులు ఖాతాలో జమ చేస్తామని చెప్పారు. ధాన్యాన్ని అమ్మి 20 రోజులు గడిచినా డబ్బులు జమ చేయలేదు. యాసంగి పంట పెట్టుబడికి చేతిలో డబ్బుల్లేక అప్పులు తెచ్చుకుంటున్న.

– కటకం వేణు, రైతు, బండపల్లి

క్లుప్తంగా

చిమ్మ చీకట్లో ముష్టిపల్లి



సిరిసిల్లటౌన్: ప్రథమ శ్రేణి మున్సిపల్ సిరిసిలలో విలీనమైన ముష్టిపల్లి గ్రామం నాలుగు రోజులుగా చిమ్మచీకట్లలో మగ్గుతోంది. ఈ విషయమై సిరిసిల్ల పదో వార్డు కౌన్సిలర్ బొల్లం నాగరాజుగౌడ్ మాట్లాడుతూ.. గ్రామంలోని 11కేవీ లైన్ స్తంభం విరిగి స్ట్రీట్ లైట్ల స్తంభంపై పడిందన్నారు. ఫలితంగా ముష్టిపల్లిలో స్ట్రీట్ లైట్ల లైన్ పూర్తిగా కాలిపోగా.. నాలుగు రోజులుగా మున్సిపల్, సెస్ అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. ఇరు శాఖల అధికారులు తమకు సంబంధించినది కాదని తప్పించుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

నేటి నుంచి బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం

- సిరిసిల్ల డిపో మేనేజర్ మనోహర్

సిరిసిల్లటౌన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేయనున్న ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం 'మహాలక్ష్మి' పథకాన్ని శనివారం ప్రారంభిస్తున్నట్లు సిరిసిల్ల డీఎం మనోహర్ తెలిపారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో అన్ని వయస్సుల బాలికలు, మహిళలు, థర్డ్‌జెండర్స్‌కు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నట్లు వివరించారు. రాష్ట్ర సరిహద్దుల వరకు ఎక్కడికైనా ఉచితంగా ప్రయాణం చేయొచ్చని తెలిపారు.

దళితుల ఆకాంక్షలు నెరవేర్చాలి

గంభీరావుపేట: కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్‌రెడ్డి దళితుల ఆకాంక్షలను నెరవేర్చాలని మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు దోసల చంద్రం అన్నారు. గత ప్రభుత్వం దళితులకిచ్చిన హామీలను విస్మరించిందన్నారు.

యువతి వివాహానికి సాయం

తంగళ్లపల్లి: ఇల్లంతకుంట మండలం ముస్కానిపేట గ్రామానికి చెందిన నిరుపేద కుటుంబం పున్నం శ్రీనివాస్-మణెవ్వ కూతురు మనుశ్రీ వివాహానికి శుక్రవారం బీజేపీ నాయకుడు బెంద్రం తిరుపతిరెడ్డి రూ.10వేలు, టేకు మంచాలను అందజేశారు. బీటీఆర్ ఫౌండేషన్ ద్వారా నిరుపేదలకు సాయం చేస్తున్న తిరుపతిరెడ్డిని పలువురు అభినందించారు.

విలీన గ్రామాలను తొలగించాలి

వేములవాడఅర్బన్: వేములవాడ మున్సిపల్‌లో విలీనం చేసిన గ్రామాలను తొలగించాలని, వీటీడీఏలో విలీనం చేసిన ముంపు గ్రామాలను పూర్తిస్థాయిలో పంచాయతీరాజ్ శాఖకు అప్పగించాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు ఎర్రం మహేశ్ అన్నారు. వేములవాడ మున్సిపల్‌లో విలీనమైన కోనాయపల్లి, శాత్రాజుపల్లి, తిప్పాపూర్, నాంపల్లిని మున్సిపల్‌లో కలపడంతో గ్రామాల ప్రజలకు ఇబ్బందిగా మారిందన్నారు. మిడ్ మానేరు ముంపు గ్రామాలను వీటీడీఏలో కలపడంతో ఇంటి నిర్మాణాల అనుమతికి ఇబ్బంది పడుతున్నారని అన్నారు.

బైక్ దొంగకు ఏడాది జైలు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ద్విచక్ర వాహనం దొంగతనం చేసిన దొంగకు సిరిసిల్ల ప్రథమశ్రేణి న్యాయమూర్తి ప్రవీణ్ ఏడాది సాధారణ జైలు శిక్ష విధించారు. ఎస్సై రమాకాంత్ తెలిపిన వివరాలు. గత ఆగస్టు 8న ఎల్లారెడ్డిపేటలోని పాత బస్టాండ్ వద్ద అదే గ్రామానికి చెందిన జయరి నరేశ్ తన బైక్‌ను పార్క్ చేశాడు. అదే రోజు వాహనం చోరీకి గురికావడంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు వాహనం కోసం గాలించగా గంభీరావుపేట మండలం గజసింగవరం గ్రామానికి చెందిన శివరాత్రి శ్రీనివాస్ అపహరించినట్లు గుర్తించి కేసు నమోదు చేశారు. శ్రీనివాస్‌ను పోలీసులు అరెస్ట్ చేసి న్యాయమూర్తి ముందు హాజరుపర్చగా.. న్యాయమూర్తి ఏడాదిపాటు జైలు శిక్ష విధించారు.

న్యూట్రిషన్ కిట్లతో ఆరోగ్యం



ముస్తాబాద్: ప్రభుత్వం అందజేసే న్యూట్రిషన్ కిట్లతో గర్భిణులు ఆరోగ్యంగా ఉంటారని వైద్యాధికారి గీతాంజలి అన్నారు. పోతుగల్ పీహెచ్‌సీలో గర్భిణులకు న్యూట్రిషన్ కిట్లను శుక్రవారం అందజేశారు. గర్భిణులు తప్పనిసరిగా కిట్లను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. హెచ్‌ఈవో యాదగిరి, స్టాఫ్‌నర్స్ రమ్య, ఎల్‌టీ ప్రవీణ్, సూపర్‌వైజర్లు, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన హరిభూషణ్



మంత్రి శ్రీధర్‌బాబును కలిసిన ఉమేశ్



మంత్రి భట్టిని కలిసిన హరిభూషణ్

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మంత్రి భట్టి విక్రమార్కను మాజీ మావోయిస్టు ఉత్తర తెలంగాణ కార్యదర్శి షమీర్‌పాష ఉరఫ్ హరిభూషణ్ శుక్రవారం తన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. మంత్రికి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. మంత్రి శ్రీధర్‌బాబును కాంగ్రెస్ రాష్ట్ర అధికార ప్రతినిధి చీటీ ఉమేశ్‌రావు కలిసి సత్కరించారు. మంత్రులను కలిసిన వారిలో మాజీ నక్సలైట్లు ఆనంద్, లచ్చన్న, మల్లారెడ్డి తదితరులున్నారు.

అందుబాటులో ఉండి సేవలందిస్తా

కోనరావుపేట: వేములవాడ నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందిస్తామని చెన్నమనేని వికాస్‌రావు, డాక్టర్ దీప అన్నారు. నాగారంలో బూత్ లెవెల్ అధికారులతో శుక్రవారం సమావేశాన్ని నిర్వహించారు. ఎన్నికల్లో గెలిచినా, ఓడినా ప్రజలకు అందుబాటులో ఉంటానన్నారు. గతంలో లాగానే స్వచ్ఛంద కార్యక్రమాలు చేపడతామన్నారు. ఎంపీటీసీ ప్రవీణ్‌కుమార్, ఉప సర్పంచ్ ఓరుగంటి శంకర్, నాయకులు గోపాడి సురేందర్ రావు, గొట్టె రామచంద్రం, అనిల్, తీగల రవీందర్ గౌడ్, తిరుపతి, అంబోజి లక్ష్మీనారాయణ, మాజీ జెడ్పీటీసీ పల్లం అన్నపూర్ణ, సింగిల్‌విండో డైరెక్టర్ గోపాడి జ్యోతి, అనుపాటి బాపురెడ్డి, శక్తికేంద్రం ఇన్‌చార్జిలు, బూత్ అధ్యక్షులు పాల్గొన్నారు.

పరామర్శ



నాగారంలో మాట్లాడుతున్న వికాస్‌రావు

నిమ్మపల్లిలో బూత్ అధ్యక్షుడు రేపాక తిరుపతి తండ్రి రాజిరెడ్డి మృతిచెందగా.. వారి కుటుంబాన్ని డాక్టర్ చెన్నమనేని వికాస్‌రావు, డాక్టర్ దీప శుక్రవారం పరామర్శించారు. నిజామాబాద్‌లో ఇటీవల ఈర్ల బాబు మృతిచెందగా.. కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు.

బతుకుదెరువు బాట..

సిరిసిల్ల: సిరిసిల్ల పట్టణ శివారులో నివాసముండే గంగిరెద్దుల కుటుంబాలకు చెందిన అమ్మాయిలు ప్లాస్టిక్ సామగ్రి అమ్ముతున్నారు. కళాశాలకు వెళ్లాల్సిన ప్రాయంలో సంచార జీవనం సాగిస్తూ వ్యాపారం చేస్తున్నారు. రూ.లక్షలు వెచ్చించినా.. అక్షర పథకాలు విద్యాగంధాన్ని వారికి అందించలేకపోయాయి. నలుగురు టీనేజీ అమ్మాయిలు ఇలా బతుకుదెరువు బాటలో.. ఉపాధి వేటలో ఊరూరా తిరుగుతున్నారు. అమ్మకాలతో వచ్చే సొమ్ములతో కుటుంబాలకు ఆసరా అవుతున్నారు.



ఆధ్యాత్మికం

రాజరాజేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం

ఎల్లారెడ్డిపేట: రాజన్నపేట గ్రామంలోని శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయ దశమ వార్షిక వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం మహాలింగార్చన, మహాన్యాస పూర్వక ఏకదశ రుద్రాభిషేకం, రుద్ర హోమం, గణపతి హోమం, మూలమంత్రావనం, నవగ్రహ హోమం జరిపారు. భక్తుల సమక్షంలో స్వామివారి కల్యాణ వేడుకలను వైభవంగా చేశారు. వివిధ గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరు కాగా.. వారి సమక్షంలో వేద పండితులు రాచర్ల విద్యాసాగర్ శర్మ, సంపత్‌శర్మ, ఆలయ అర్చకుడు రామకోటి రామచంద్రశర్మ ప్రత్యేక పూజలు, కల్యాణం జరిపించారు. సర్పంచ్ ముక్క శంకర్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



కల్యాణం జరిపిస్తున్న వేద పండితులు

స్వామియే శరణమయ్యప్ప

ముస్తాబాద్: ముస్తాబాద్‌లో అయ్యప్ప స్వామి పడిపూజ మహోత్సవాన్ని మేరుగు అంజాగౌడ్ శుక్రవారం ఘనంగా నిర్వహించారు. రాజు గురుస్వామి ఆధ్వర్యంలో జరిగిన పదునెట్టాంబడి ఉత్సవాల్లో అయ్యప్ప స్వాములు పాల్గొని పూజలు చేశారు. భజనలతో పరవశించిపోయారు. అనంతరం భిక్ష చేశారు.



భజన చేస్తున్న స్వాములు

ముగిసిన విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు

గంభీరావుపేట: మండల కేంద్రంలో శ్రీమహంకాళీ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు శుక్రవారం ముగిశాయి. 4రోజుల పాటు ఉత్సవాలు అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. అమ్మవారిని భక్తులు దర్శించుకొని పూజలు చేశారు.



అమ్మవారిని దర్శిస్తున్న భక్తులు

అభివృద్ధి పథంలో వేములవాడ



మాట్లాడుతున్న ఆది శ్రీనివాస్



ఆది శ్రీనివాస్‌తో రుద్రంగి గంగపుత్ర సంఘం నాయకులు

- ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్

వేములవాడఅర్బన్: వేములవాడ ప్రాంత ప్రజలకిచ్చిన హామీలు నెరవేర్చే బాధ్యత తమదేనని, వేములవాడను అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకుపోతామని వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. వేములవాడ పట్టణంలోని ఎమ్మెల్యే నివాసంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. తెలంగాణ ప్రజలు మార్పు కోరడంతోనే కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిందన్నారు. నేడు మహిళలకు బస్సు ప్రయాణం ఉచితం ప్రారంభిస్తామని అన్నారు. నా విజయాన్ని ప్రజలకు అంకితం చేస్తున్నామన్నారు. రాజన్నకు ఏటా వంద కోట్లు ఇస్తామని చెప్పి ఇవ్వని కేసీఆర్ సర్కార్‌కు ఆ దేవుడే బుద్ధి చెప్పాడన్నారు. జెడ్పీటీసీ నాగం కుమార్, కౌన్సిలర్ బింగి మహేశ్, ఎంపీటీసీ రంగు వెంకటేష్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు చంద్రగిరి శ్రీనివాస్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సాగరం వెంకటస్వామి, నాయకులు కూరగాయల కొమురయ్య, చిలుక రమేశ్, ఎర్రం రాజు, నీలం గురువయ్య, పుల్కం రాజు, ఎర్రం సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన నాయకులు

రుద్రంగి: ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌ను వేములవాడలోని ఆయన నివాసంలో రుద్రంగి గంగపుత్ర సంఘం నాయకులు, రైతులు మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. దేశవేని శ్రీనివాస్, భూమేశ్, ధర్మేశ్, విక్రమ్, వినయ్, గాజ నర్సయ్య ఉన్నారు.

సత్కారం

వేములవాడరూరల్: ఆది శ్రీనివాస్‌ను లింగంపల్లి, ఎదురుగట్ల తదితర గ్రామాల ప్రజలు సన్మానించారు. చెక్కపల్లికి ఓ వివాహ వేడుకకు వెళ్లి తిరిగి వస్తుండగా ఎదురుగట్ల గ్రామంలో సత్కరించారు.

ఆదిని కలిసిన నాయకులు

కోనరావుపేట: ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌ను బావుసాయిపేట, ఇతర గ్రామాల నాయకులు కలిశారు. హైదరాబాద్‌లో సీఎం ప్రమాణ స్వీకారం అనంతరం వేములవాడకు చేరిన ఆది శ్రీనివాస్‌ను కాంగ్రెస్ మండల అధ్యక్షుడు షేక్ ఫిరోజ్‌పాషా, నాయకుడు నందూగౌడ్, గ్రామ శాఖ అధ్యక్షుడు ఎక్కల్‌దేవి శ్రీనివాస్ తదితరులు ఘనంగా సన్మానించారు.

సీఎం దృష్టికి తీసుకెళ్తా

చందుర్తి(వేములవాడ) పేయింటింగ్ చిత్ర కళాకారుల సమస్యల పరిష్కారం కోసం సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. పేయింటింగ్ చిత్ర కళాకారులు ఆయన చిత్రాన్ని గీసి చిత్రపటాన్ని శుక్రవారం అందించారు. తెలంగాణ పేయింటింగ్ చిత్ర కళాకారుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు వెంగళ గనేశ్వర్, గణముక్కుల మల్లేశం, కోశాధికారి ఇందూరి మధు, సభ్యుడు భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.



ఆది శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న ఎదురుగట్ల వాసులు



కోనరావుపేట: ఆది శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న నాయకులు

మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు

తంగళ్లపల్లి(సిరిసిల్ల): మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని తంగళ్లపల్లి ఎస్సై వి.వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం రాత్రి మండల కేంద్రంలో వాహనాల తనిఖీ తోపాటు డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించారు. పలువురిపై కేసులు నమోదు చేశారు.

కామారెడ్డి ఎమ్మెల్యేను కలిసిన నాయకులు

ఎల్లారెడ్డిపేట: ఇద్దరు ముఖ్యమంత్రులను ఎన్నికల్లో ఓడించిన బీజేపీ కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డిని ఎల్లారెడ్డిపేట మండల బీజేపీ నాయకులు శుక్రవారం కలిశారు. కామారెడ్డిలోని తన నివాసంలో కలిసి పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సన్మానించారు. చందుపట్ల లక్ష్మారెడ్డి, బందారపు లక్ష్మారెడ్డి, చందుపట్ల రాంరెడ్డి, మద్దుల బుగ్గారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



వెంకటరమణారెడ్డితో నాయకులు

వల్లంపట్ల పంచాయతీలో అవినీతి

తంగళ్లపల్లి(సిరిసిల్ల): ఇల్లంతకుంట మండలం వల్లంపట్ల గ్రామ పంచాయతీలో రూ.లక్షల అవినీతి జరిగిందని మండలవ్యాప్తంగా శుక్రవారం ప్రచారం జరిగింది. దీనికి సంబంధించిన పోస్టులు సోషల్ మీడియాలో చెక్కర్లు కొట్టాయి. రూ.85లక్షల మేరకు అవినీతి జరిగిందని, దీనివెనక ఒక ప్రజాప్రతినిధి భర్త ఉన్నట్లు ఆరోపణలు వినిపించాయి. ఈ విషయమై ఇల్లంతకుంట ఇన్‌చార్జి ఎంపీడీవో మిర్జాను సాక్షి వివరణ కోరగా.. ఆరోపణలు వచ్చిన మాట వాస్తవమేనన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాలతో డీఎల్‌పీవో విచారణ చేపట్టారని, విచారణ అనంతరం పూర్తి వివరాలు తెలుస్తాయన్నారు.